# నీవు ఏదైతేకాదో దానిలోనుండి విడుదలపొందటానికి విచారణ అవసరం

(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, భీమవరం 13-4-2001)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

సత్యాన్వేషణ లేనివాడికి సత్యం ఎరుకపడదు. మనం సత్యాన్ని అన్వేషిస్తున్నామా లేదా అనేది సత్యం చూసుకొంటూ ఉంటుంది. సత్యం అంటే చైతన్యం, అది జడవస్తువు కాదు. కేవలం సత్యం తప్పించి నాకు ఏదీ అవసరం లేదు అని ఎవడైతే సత్యం కోసం జీవిస్తున్నాడో వాడికి సత్యం తెలియబడుతుంది. నీవుసత్యాన్ని తెలుసుకొనే తీరాలి ఇందులో రాజీలేదు ఎందుచేతనంటే సత్యాన్ని తెలుసుకొనే వరకు నీకు స్వేచ్ఛలేదు. అయితే సత్యం ఎక్కడ ఉంది? అది ఎక్కడో లేదు నీహృదయంలోనే ఉంది, అది నీవుగా ఉన్నావు కాని దాని తాలుక అనుభవం నీకులేదు. అది నీ హదయంలోనే ఉంది అనికూడా నీకు తెలియటంలేదు. ఉందని తెలిస్తే దానికోసం ప్రయత్నం చేస్తావు. ప్రయత్నం ఎప్పుడైతే మొదలుపెట్టావో ఈశ్వరానుగ్రహం వస్తుంది. స్వప్రయత్నం, కాలపరిపక్వం, ఈశ్వరకటాక్షం ఇవి మూడూ మనం గుర్తుపెట్టుకోవాలి. సత్యం మన హృదయంలోనే ఉంది అనే దృఢనిశ్చయం ముందు మనకు ఉండాలి. తల్లిగర్భంలోనుండి వచ్చినది మొదలు స్మశానంకు వెళ్లేవరకు ఎవరి జీవితంకూడా యూనిఫారమ్‌గా వెళ్లదు, ఎన్నో హెచ్చుతగ్గులు ఉంటాయి, వాటిని మనం భరించాలి. మనందరం చేస్తున్న పొరపాటు ఏమిటి అంటే మనస్సుతో ఎన్నో విషయాలు నేర్చుకొంటాము కాని మనస్సును ఎడ్యుకేట్ చేయటం లేదు. ముందు మన మనస్సుకు ట్రైనింగ్ ఇవ్వాలి. సత్యం అనేది సూక్ష్మాతి సూక్ష్మంగా ఉంటుంది. దానిని గ్రహించటానికి బుద్ధి సూక్ష్మత ఉండాలి. సూక్ష్మ విషయాలు గ్రహించటానికి తగినంత ట్రైనింగ్ అవసరం. సత్యాన్వేషకుడు ఎలా ఉండాలంటే ఈ శరీరం ఏదోరోజు మరణిస్తుంది, ఈ శరీరం మరణించకముందే శరీరం ఉండగానే మనం ఎలా మరణించాలో నేర్చుకొంటే వాడికి సత్యసాక్షాత్కారం కలుగుతుంది. సత్యం నీకు అనుభవంలోనికి వచ్చింది అనుకో ఈ శరీరంఉన్నా ఇబ్బంది లేదు, శరీరం పోయినా ఇబ్బందిలేదు. శరీరం మరణించిన తరువాతకూడా మనం ఉంటాముకాని ఉండము అనే తలంపు వలన మనకు భయం కలుగుతుంది. నేను చనిపోతున్నాను అంటే అక్కడ శరీరమే నీకు నేనుగా వ్యక్తమవుతోంది. అది మిధ్యానేను. దానిని మనం విడిచిపెట్టాలి. విడిచిపెట్టవలసినది విడిచిపెడితే పట్టుకోవలసింది నీచేతికి అందుతుంది.

గ్రంధాలు చదవటంకంటే జీవితంలోవచ్చే సంఘటనలద్వారా మనం పాఠాలు నేర్చుకోవాలి. మనకు అంతర్దృష్టి ఉంటే జీవితంలోవచ్చే సంఘటనలు మనలను ఎడ్యుకేట్ చేస్తాయి. యదార్థం చెప్పాలంటే మనం ఎన్ని శాస్త్రాలు చదివినా, ఎన్ని డిగ్రీలు సంపాదించినా మనస్సుకు లోచూపు లేకపోతే, మనస్సు హృదయాభిముఖంగా ప్రయాణం చేయకపోతే అసలు నిజమైన విద్య ప్రారంభం అవ్వదు. సత్యం అనేది మనస్సుతో గ్రహించేదికాదు. మనస్సు ఎక్కడైతే అణిగిందో, మనస్సు ఎక్కడైతే నశించిందో అక్కడ సత్యం నీకు అనుభవంలోనికి వస్తుంది. మనస్సుకు అంతర్దృష్టి కలగాలి. మనస్సుకు అంతర్దృష్టి కలగటం కోసమే సజ్జన సాంగత్యం, సత్కర్మ, ఈ ప్రవచనాలు. పూర్వజన్మలో సత్కర్మ చేసినవారికి కోపం, అసూయ, రాగద్వేషములు తక్కువగా ఉంటాయి. పూర్వజన్మలో సత్కర్మ చేయనివాడు ప్రతీ చిన్నవిషయానికి ఉద్రేకపడతాడు. నీ మనస్సుకు చిన్నమాటను భరించేశక్తి లేనప్పుడు ఇంక అది లోపలకు ఎలా వెడుతుంది. మనం దేహానికి కంఫర్టు చూసుకొంటాముగాని మనస్సు కంట్రోలు చూసుకోము. మనస్సుకు కంట్రోలు వస్తేగాని దానికి లోచూపు కలుగదు. లోచూపు కలిగితేగాని దానికి నిజమైన ఎడ్యుకేషన్ ప్రారంభంకాదు. నీకు అనేక తలంపులు ఉన్నాయి. వాటికి అడుగున ఒకమూలతలంపు ఉంది. దేహం నేను అనేది మూలతలంపు. దానిని ఉపసంహరించు, ఉపసంహరించు ఎంతవరకు ఉపసంహరించాలి అంటే అది దానిమూలమైన హృదయంలోనికి వెళ్ళేవరకు దానిని ఉపసంహరించు. ఇక్కడనుండి మద్రాసు 300 కి॥మీ॥ అనుకోండి. 100 కి॥మీ॥ ప్రయాణంచేస్తే మద్రాసు రాదు. 299 కి॥మీ॥ ప్రయాణం చేసిన మద్రాసురాదు. 300 కి॥మీ॥ ప్రయాణం చేయవలసిందే. కొంతదూరం ప్రయాణంచేసి ఇంకా మద్రాసు రాలేదు అని విసుగుచెంది వెనుకకు తిరిగి వచ్చేస్తే అక్కడ మద్రాసు లేదు అనికాదు. అలాగే సత్యం నీ హృదయంలో ఉంది. అది ఎంత లోతులలోఉందో అంతవరకు నీ మనస్సును ఉపసంహరించవలసిందే. ఇందులో రాజీలేదు.

భగవంతుడు మీకు ఇచ్చిన అవకాశములను సత్యానుభవం పొందటానికి ఉపయోగించుకోవాలి. సత్యానుభవం పొందటమే మీధ్యేయం అది మిస్ అవ్వవద్దు. నీవు సత్యాన్వేషణలో ఉంటే ఆ టైములో నీ దేహం మరణించినా కొత్తదేహం ఎక్కడ ఇస్తాడు అంటే నీవు ఎక్కడ జన్మిస్తే ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి వస్తావో చూసి అటువంటిచోట నీకు దేహాన్ని ఇస్తాను అని భగవంతుడు చెపుతున్నాడు కాని మనకు భగవంతుడు చెప్పిన మాటలమీద విశ్వాసంలేదు. మీరు పని చేసుకోండి. సోమరితనంగా ఉండవద్దు. మీరు చేసే ప్రక్రియ

ఎలా ఉండాలంటే మీరు చేసే పని అజ్ఞానంలోనుండి విడుదల పొందటానికి సహకరించాలి. నీవు చేస్తున్న పనివల్ల నీ దేహబుద్ధినుండి విడుదల పొందాలి. అది యోగం. మీరు ఏకాంతంగా కూర్చోండి. ఊపిరి పీల్చుకోవటం, వదలటం మనస్సుతో చూస్తూ ఉండండి. మీ మనస్సు నిర్మలంగాఉంటే, మీకు మంచి తలంపులు వస్తూఉంటే గాలి నెమ్మదిగా లోపలకు వెళుతుంది, నెమ్మదిగా బయటకు వస్తుంది. నీకు చెడు తలంపులు వస్తున్నాయి అనుకో, నీకు ఉద్రేకం వచ్చింది అనుకో వెంటనే గాలి బుసకొట్టినట్లుగా వేగంగా లోపలకు, బయటకు వస్తుంది. ఇది నీకు అర్ధమయితే చెడు తలంపులు వస్తున్నాయో, మంచితలంపులు వస్తున్నాయో నీకు తెలుస్తుంది. చెడుతలంపులు వస్తూఉంటే వాటిని తొలగించుకోవటానికి ప్రయత్నంచెయ్యి. నీలో ఏదైనా చెడ్డఉన్నా నాలో ఈ చెడ్డఉంది, ఈ చెడ్డఉంది అని చాధస్తంగా అనుకోవద్దు. చెడు ఉన్నప్పుడుకూడా నీవు నిర్మలుడవే, నీవు చైతన్య స్వరూపుడవే కాని నీలోఉన్న చెడ్డవలన అది నీకు అందటంలేదు. దానిని తొలగించుకోవటానికి ప్రయత్నం చెయ్యి. అదే సాధన. మనం నిజంగా సాధన చేస్తూఉంటే మన మొఖంలో, మనచేతలో, మన ప్రవర్తనలో వికాశం తెలుస్తూ ఉంటుంది. కొండమీద దీపంపెట్టి ఎవరికీ కనబడకూడదు అంటే ఎలా సాధ్యం, అది కనిపిస్తూనే ఉంటుంది. మీకు బ్రహ్మానుభవం కలిగినప్పుడు మీనుండి జ్ఞానతరంగాలు, శాంతితరంగాలు, కాంతితరంగాలు భూమిమీదకు వ్యాపిస్తాయి.

దేహాన్ని, మనస్సును మేగ్జిమమ్ ఉపయోగించుకొని ఏదో మార్గంద్వారాప్రయాణించి దేహము నేనుఅనే బుద్ధిలోనుండి విడుదలపొందాలి. నీవు కాని దేహంతో తాదాప్యం పొందుతున్నావు. నీవు కానిదానితో తాదాప్యం పొందుతున్నంతకాలం నీవు ఎవరో నీకు తెలియదు. నీవు ఏదైతేకాదో దానిలోనుండి విడుదల పొందటానికి విచారణ అవసరం. విచారణద్వారా దానిలోనుండి విడుదలపొందితే నీవు ఏదైతే అవునో అది అంటే ఆత్మ తనంతట తానుగా నీకు వ్యక్తమవుతుంది. దేహగతమైన నేను ఎక్కడైతే అణిగిపోయిందో అక్కడే నిజమైన నేను నీకు వ్యక్తమవుతుంది. ఈ దేహమే నేను, దేహమే సత్యం అని నీవు అనుకోవచ్చు. అలా అనుకొన్నంత మాత్రంచేత అది నీవుకాదు. ఆ దేహం ఏదోరోజు నిన్ను విడిచిపెట్టేస్తుంది. మనదైనందిన జీవితంలో ఆడంబరం తగ్గాలి. లోపల ఉన్న వస్తువుకు ఆడంబరంలేదు. మన జీవితవిధానంలో ఆడంబరం ఉన్నప్పుడు అది మనకు అనుభవంలోనికిరాదు. వారిలో ఆ పొరపాటుఉంది, ఈ పొరపాటు ఉంది అని చూసేబదులు నీలోఉన్న పొరపాటును చూసుకొని దానిని సరిచేసుకొంటే నువ్వు బాగుపడతావు.

20-07-2001